కురుపాంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఏకధాటిగా గంటపాటు భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులు క్రితం రెండు రోజులు తుఫాను పెట్టినప్పటికీ మళ్లీ ఎండలు ఎక్కడంతో ఎండ వేడిమి వేసవిని తలపించేలా ఉండడంతో తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా వర్షంతో కొంత ఉపశమనం కలగగా, మరోవైపు ఇప్పటికే ఉడిసిన ఉబలకు, ఆరుతడి పంటలకు ఎంతగానో ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'హైడ్రో పవర్' అనుమతులు రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్
- హైడ్రో పవర్ ప్లాంట్‌కు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు ధ్వంసం

ప్రజాశక్తి - పాచిపెంట

అరకు, పాచిపెంట మండలాల సరిహద్దు పంచాయతీలైన గుమ్మికోట, లోతేరు, శతాభి పంచాయితీల్లో సుమారు 60 గ్రామాల్లో నవయుగ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ కంపెనీకి హైడ్రో పవర్ ప్లాంట్ కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సిపిఎం కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం శతాభి పంచాయితీలో నవయుగ కంపెనీ హైడ్రో పవర్ ప్లాంట్ కోసం నిర్మించిన దిమ్మలను పరిశీలించిన అనంతరం శతాబి సర్పంచ్ సిల్పజన్ని రామయ్య ఆధ్వర్యంలో దిమ్మలను కూలగొట్టారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ అధికార కూటమి ప్రభుత్వం గిరిజనులను మోసగించి నవయుగ కంపెనీ 1400 మెగావాట్ల విద్యుత్ తయారు చేసుకోవడానికి గుమ్మకోట, లోతేరు, శతాబీ పంచాయితీల్లో 60 గ్రామాల్లో గిరిజన ప్రాంతంలో అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ ప్రాంతంలో కనీసం గిరిజనులకు ఎటువంటి సమాచారం లేకుండా అపరిచిత వ్యక్తులు డ్రోన్లతో సర్వే చేస్తున్నారని, గిరిజనులు లేని సమయంలో దిమ్మల నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మికోట, లోతేరు, శతాభి పంచాయతీలు ఐదో షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ కనీసం అధికారులు గానీ ప్రభుత్వంగానీ చట్టాన్ని అమలు చేయడం లేదని అన్నారు. ఐదో షెడ్యూల్‌ను ప్రభుత్వం ఎలా ఉల్లంఘిస్తుందో నవయుగ కంపెనీకి ఇచ్చిన అనుమతిలే నిదర్శనమని అన్నారు. ఈ గిరిజన ప్రాంతంలో అనేక సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నాయని, అవన్నీ నాశనమవుతాయని, అలాగే కాఫీ, సీతాఫలాలు, చింత, జీడి, మిరియాలు, పసుపు, వంటి పంటలు విస్తారంగా పండుతున్నాయని అన్నారు. ఇటువంటి ప్రకృతి ప్రసాదించిన పంటలు పండుతున్న గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పగించడం దుర్మార్గమని అన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షించే గెడ్డలు వాగులు, వంకలు ఉన్నాయని, వాటన్నింటినీ అభివృద్ధి చేసి గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే నవయుగ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ కంపెనీకి ఇచ్చిన హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అరకు ప్రాంతంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరిజనులు ఆందోళన చేస్తున్నారని, ఈ ప్రాంతంలోనూ గిరిజనులందర్నీ కదిలించి హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మాదల రాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.శ్రీరామ్ కుమార్, శిల్ప జన్నీ అప్పలస్వామి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలను ధ్వంసం చేస్తున్న గిరిజనులు

గోవా గవర్నర్ అశోక్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజుకు ఘనస్వాగతం లభించింది. గవర్నర్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా ఆదివారం జిల్లాకు విచ్చేశారు. ఆయనకు స్థానిక అశోక్ బంగ్లా వద్ద ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బంగ్లాకు చేరుకొని, అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభకు హాజరైన అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనసూయ

అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలి
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అనసూయ డిమాండ్ చేశారు. యూనియన్ రెండో జిల్లా మహాసభలు స్థానిక గిరిజన సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించారు. తొలుత యూనియన్ పతాకాన్ని జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి ఆవిష్కరించారు. అనంతరం విధుల్లో మరణించిన వర్కర్లకు, హెల్పర్లకు, కార్మికులకు జిల్లా ఉపాధ్యక్షులు హిమప్రభ సంతాపం ప్రకటిస్తూ నివాళులర్పించారు. అనంతరం అనసూయ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లను కార్మికులుగా గుర్తించడంలో విఫలమైందని విమర్శించారు. విద్య ప్రాథమిక దశను పెంచి పోషిస్తూ, ప్రభుత్వ ఒత్తిళ్లను, నిర్బంధాలను, దాడులను ఎదుర్కొని అంగన్వాడీలు విధులు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం కార్మికులుగా గుర్తించకపోవడం దారుణమని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, నేటి కూటమి నాయకులు అంగన్వాడీ పోరాట దీక్షల వద్దకు వచ్చి టిడిపి ప్రభుత్వం ఏర్పడిన మొదట నాడే అంగన్వాడీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని వాపోయారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు బడ్జెట్లో ఎటువంటి కేటాయింపు లేవని, సెక్టార్ల నిర్దిష్ట అమలుకు ఎటువంటి సహాయ నిధి లేకపోవడం వల్ల చాలా దారుణతి స్థితి కొనసాగుతుందని తెలిపారు. ఈ చర్యల వల్ల 11 ఏళ్లుగా అంగన్వాడీలకు వేతనాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇస్తున్న చాలీచాలని వేతనానికి ప్రభుత్వ పథకాలకు అనహర్హులుగా గుర్తించడం అన్యాయమని, వెంటనే అర్హులుగా గుర్తించాలని, ప్రభుత్వ వేధింపులు ఆపాలని, నెట్వర్క్ స్పీడ్‌లను పెంచాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి గ్రాడ్యుయేట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై తీర్మానం చేస్తూ ప్రతినిధులంతా ఆమోదించారు. మహాసభలు సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, కార్యదర్శి ఎన్.వై.నాయుడు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి.ఇందిరా, ఎండిఎం సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతకుమారి, ఎపి ఆశా వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివాని సౌహార్ద సందేశాన్ని అందించారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు ప్రతినిధులుగా పాల్గొన్నారు.

అమరవేణి, అధ్యక్షులు

జ్యోతిలక్ష్మి, కార్యదర్శి

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరవేణి, జ్యోతిలక్ష్మి

మహాసభల అనంతరం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా బి.అమరవేణి, కార్యదర్శిగా జి.జ్యోతిలక్ష్మి, కోశాధికారిగా ఎ.సత్య, గౌరవ అధ్యక్షులుగా ఎం.ఉమామహేశ్వరి, సహాయ కార్యదర్శులుగా అలివేలు, గౌరమ్మ, వి.రామలక్ష్మి, పార్వతి, కె.దాలమ్మ, ఉపాధ్యక్షులుగా పి.సరళకుమారి, పార్వతి, గౌరీశ్వరి, పుష్పకుమారి, హిమప్రభ, కన్యతో పాటు మరో 11 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పిఎసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం జియ్యమ్మవలస మండలం చినమేరంగి, బిజెపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు కొత్తగా ఏర్పాటైన పాలక వర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. రైతు సంక్షేమానికి కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పిఎసిఎస్‌లకు కొత్తగా ఏర్పడిన అధ్యక్షులు, డైరెక్టర్లు రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ రుణాలు సక్రమంగా అందజేయాలన్నారు. చినమేరంగి పిఎసిఎస్ అధ్యక్షునిగా రెడ్డి బలరాంస్వామి నాయుడు, డైరెక్టర్లుగా సిరిసిబిల్లి శంకర్రావు, రెడ్డి రామినాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపురం పిఎసిఎస్ అధ్యక్షునిగా ద్వారపురెడ్డి సోములు మాస్టారు, డైరెక్టర్లుగా బంకుపల్లి నర్సింగరావు, వావిలాపల్లి అప్పలనాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో చినమేరంగి, బిజెపురం పిఎసిఎస్ సిఇఒలు సామల పోలిరాజు, చీపురుపల్లి తిరుపతి సిబ్బంది, ఎంపిపి బొంగు సురేష్, టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు జోగి భుజంగరావు, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎం సత్యం నాయుడు, వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు జి.శ్రీరామ్మూర్తి నాయుడు, దాసరి రామారావు నాయుడు, లంక గోపాలం, మజ్జి చంద్రమౌళి, బొత్స సూర్య ప్రకాశరావు, రాగాల అప్పలకొండ, జనసేన మండల అధ్యక్షులు వారణాసి శివకుమార్, చినమేరంగి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అల్లు ఈశ్వరరావు, పెద్ద ఎత్తున రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి మేలు చేయడమే కాక పర్యావరణానికి మేలు కలుగుతుందని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిట్ ఇండియా కార్యక్రమానికి పిలుపునిచ్చాయని ఇందులో భాగంగా ప్రతి ఆదివారం సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం మనమందరి జీవన శైలిలో ప్రతిరోజూ ఎక్కువగా మోటార్ సైకిళ్ళు, కార్లలో ప్రయాణించడం జరుగుతుందని, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ, శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమని అందులో భాగంగా తమ దైనందిన జీవనశైలిలో కొంత సమయం సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ప్రతి రోజు విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం తప్పనిసరని, కావున సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు సైకిల్ ర్యాలిలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమై ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పాత బస్టాండ్, బైపాస్ రోడ్ గుండా మళ్లీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు సైక్లింగ్ నిర్వహించారు.

పార్వతీపురం పట్టణంలో సైకిల్ చేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, పోలీసు సిబ్బంది

పాలకొండ పట్టణంలో సైకిల్ చేస్తున్న డిఎస్‌పి రాంబాబు, పోలీసు సిబ్బంది

పాలకొండ : వ్యాయామం తోనే ఆరోగ్యం సాధ్యపడుతుందని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. ఫిట్‌ఇండియా నినాదంతో పట్టణంలో సైక్లింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. సైక్లింగ్ కూడా ఇందులో భాగమేనన్నారు. ఆయనతో పాటు ఎస్సై ప్రయోగమూర్తి సిబ్బంది ఉన్నారు.

వీరఘట్టం: ఫిట్ ఇండియా సాధించేందుకు యువత ముందుకు రావాలని ఎస్సై జి.కళాధర్ పిలుపునిచ్చారు. వీరఘట్టంలో సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. సిబ్బందితో కలిసి సైక్లింగ్ సండే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో కురుపాం, నీలకంఠాపురంలో ఎస్‌ఐలు పి.నారాయణరావు, ఎ. నీలకంఠరావు ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సండే సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉండాలంటే వ్యాయామం తప్పనిసరిని, కావున ప్రతి ఆదివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీతో ఆరోగ్యమే మహాభాగ్యమని పిలుపునిచ్చారు. శరీరం ఫిట్నెస్ గా ఉంటుందని అన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై 'గండి' కన్ను

ప్రజాశక్తి - పాలకొండ

గండి రామునాయుడు

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పదవిపై మండల పార్టీ అధ్యక్షులు గండి రామి నాయుడు కన్నుపడింది. కొత్తగా బిసి నాయకుడ్ని అధ్యక్షులుగా నియమిస్తారని పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు రావడంతో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. హేమాహేమీలు ఈ పదవిని ఆశిస్తున్నప్పటికీ రామినాయుడు కూడా పోటీ పడుతున్నారు. రామునాయుడు మండల పార్టీ అధ్యక్షుడితో పాటు తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్రడైరెక్టర్, కురుపాం నియోజకవర్గ పరిశీలకులుగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే గెలుపు కోసం ఎంతగానో కృషి చేశానని, అంతకుముందు పార్టీ సంస్థా గతంగా బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. రామినాయుడుకు ఓ మంత్రి ఆశీస్సులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ జిల్లాలో వెలమల, కాపులు సామాజిక వర్గాలు బలంగా ఉన్నాయి. కాపు సామాజిక వర్గానికి చెందిన రామినాయుడు తనకు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరుతున్నట్లు తెలుస్తుంది.

శిష్టకరణ సంఘ అధ్యక్షులుగా శ్రీధర్

ప్రజాశక్తి పాలకొండ

శిష్టకరణ సంఘం అధ్యక్షులుగా బాసురు శ్రీధర్ ఎన్నికయ్యారు. ఆదివారం ఈ సంఘం ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా సాహిని శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ఐఎఎస్ పట్నాయక్, బాసూర్ కృష్ణమూర్తి, సాహిని ప్రసాదరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం బలోపాతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సభ్యులంతా అందుబాటులో ఉండి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బలిజిపేట

పాలకొండ పట్టణంలో సెప్టెంబర్ 13, 14తేదీల్లో జరగనున్న సిఐటియు 11వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, మండల కన్వీనర్ కె.దాలమ్మ, కో-కన్వీనర్ యు.లక్ష్మి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 8గంటల పని హక్కును హరిస్తూ 12 గంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న 44 చట్టాలను కుదించి నేడు నాలుగు లేబర్ కోడ్‌లు మార్చిందన్నారు. రాత్రిపూట మహిళలచే పనిచేయడం అన్యాయమన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల సాధనకై సెప్టెంబర్ 13,14 తేదీల్లో జరుగు జిల్లా మహాసభల్లో చర్చ జరుగుతుందని, కావున అన్ని వర్గాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మరియమ్మ, పాకీరు, సంతమ,రాజు, సోములు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లామహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

జాతీయ సేవా అవార్డును అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీనివాసరావుకు జాతీయ సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలికి చెందిన బత్తిలి శ్రీనివాసరావు ప్రజా సంకల్ప వేదిక అనే సంస్థ నుంచి జాతీయ సేవా రత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, ఆధ్యాత్మిక రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఇటువంటి అవార్డులు సమాజంలో గుర్తింపును, ప్రతిష్టను కలుగజేసి, మరింత ఆధునిక సేవ చేయాలనే భావన కలుగజేస్తుందని ఆయన తెలిపారు.

దెబ్బతిన్న మొక్కజొన్న

రైతులను ఆదుకోవాలి
గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎ.వెంకంపేట పంచాయతీ పరిధిలోని లోతుగెడ్డ గిరిజన గ్రామంలో సుమారు 5 ఎకరాల మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని, వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి గిరిజన రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక రైతులతో కలిసి నష్టపోయిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. తుఫాను కారణంగా వచ్చిన ఈదురుగాలులకు పంట దెబ్బతిందని రైతులు చౌడిపల్లి ఓబి, కృష్ణ, బాలయ్య, శ్రీలత, సోందియా ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించి, నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

తెగుళ్ల బారిన మొక్కజొన్న

మండలంలోని మొక్కజొన్న పంట తెగుళ్ల బారిన పడుతున్నా అధికారులు ఎవరూ కనీసం పట్టించుకోవడంలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని లోతుగెడ్డకు చెందిన గిరిజన రైతులు తమ మొక్కజొన్న తోటకు పురుగు పట్టడంతో పూర్తిగా ఎర్రబారిపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కజొన్న సాగు చేస్తున్న పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తెగుళ్ల నివారణకు తగు సూచనలు ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు, రైతులు

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా పరీక్షిత్‌రాజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్ జన్మదిన పురస్కరించుకొని ఆదివారం కురుపాంలో గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైసిపి రాష్ట్ర మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు జన్మదిన వేడుకలు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కళింగ మల్లేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండలానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినయ్‌కు అభినందనలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోనిమారుమూల గిరిజన గ్రామమైన సీధికి చెందిన గేదెల వినయ్‌కు కేరళలోని కాలికట్ ఎన్ఐటి నిర్వహించిన 21వ కన్వకేషన్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని ఎన్విరాన్మెంటల్ జియోటెక్ స్పెషలైజేషన్‌లో ఎంటెక్ డిగ్రీను అందుకున్నారు. దీంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. సాధారణ గిరిజన నుంచి దేశప్రఖ్యాత విద్యాసంస్థ ఎన్ఐటిలో ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచిన వినయ్‌ను పలువురు అభినందించారు.

రైతులకు సరిపడా ఎరువులు ఉంచాలి

ప్రజాశక్తి - కురుపాం

రైతులకు సరిపడే ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందక దళారుల వద్ద అధిక ధరలకు కొనలేక ఇబ్బంది పడుతున్నారని, రైతు సేవా కేద్రాలకు రైతులు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్లు అడిగితే తమ వద్ద లేవని, ఇండెంట్లు పెట్టామని, వస్తాయని చెబుతున్నారు తప్ప నెలలు గడుస్తున్నా ఇంకా రైతులకు అందుబాటులేని డిఎపి, యురియా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతు సేవ కేంద్రాల వద్ద రైతులకు సరిపడా ఎరువులు ఉంచాలని డిమాండ్ చేశారు.

గిరిజన రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న మల్లికార్జునరావు, గౌస్

గిరిజన రైతులకు పండ్ల మొక్కలు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కొత్తకోట మల్లికార్జునరావు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యాన మండలంలోని బియ్యాలవలస పంచాయతీలో గల దురిబిలి గిరిజన గ్రామంలో 75 మంది గిరిజన రైతు కుటుంబాలకు మామిడి, సపోటా, జామి మొక్కలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య భద్రత ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి పెద్దవి అయ్యేంత వరకు సంరక్షణ బాధ్యతను కూడా చూడాలని కోరారు. ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ ఎవరైనా దాతలు ముందుకొచ్చి పండ్ల మొక్కలు అందిస్తే ఆదివాసీ గ్రామాల్లో రైతులకు అందించడంతో పాటు వాటిని సంరక్షించేలా తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పువ్వల అజారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, రైతులు పాల్గొన్నారు .

ఫ్లైఓవర్‌పై ఏర్పడిన గుంతలు

ఫ్లైఓవర్‌పై గుంతలతో వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవలే ఫ్లైఓవర్ పై పలుచోట్ల ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేయించినప్పటికీ అవి మూడనాళ్ళ ముచ్చటగానే అవుతున్నాయి. ఈ గుంతలకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఫ్లై ఓవర్‌పై ఉన్న గోతులను కప్పించేందుకు చర్యలు చేపడితే వాహన ప్రమాదాలు నివారించవచ్చునని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

రేగులగూడలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ రేగులుగూడలో ఆదివారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పనితీరును ఎండగట్టారు. సూపర్ సిక్స్ అమల్లో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. తల్లికి వందనం కొందరికే వచ్చిందన్నారు. ఉచిత గ్యాస్ పథకం తుస్సుమందని, అర్హులకు రాలేదని విమర్శించారు. అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకం ప్రయాణికులకు సరిపడా లేవని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చలపతిరావు, పాలకొండ ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, ఎంపిటిసి సభ్యులు గణేష్, మాజీ సర్పంచ్ సింహాద్రి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రేగులగూడలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

పారిశ్రామిక ప్రగతి ఏది?

చిన్న తరహా పరిశ్రమల ప్రస్తావన మరిచారు
జీడి ప్రాసెసింగ్ యూనిట్లు విడిచారు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అభివృద్ధికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఏ ప్రభుత్వం వచ్చినా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు హామీ ప్రకటనలకే పరిమితం చేస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం అమలు జరగడం లేదు. మరో వైపు జీడిప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేసి చివరికి విడిచారు. దీంతో గత కొన్నేళ్లుగా గిరిజన ఉపాధి కల్పనా చర్యలు శూన్యం. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి గిరిజనులకు ఉపాధి కల్పించాలన్న డిమాండ్ ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో గిరిజనులకు సరైన ఉపాధి మార్గం లేక నిరాశలో ఉన్నారు. గుమ్మలక్ష్మీపురం మన్యంలో పుష్కలమైన వనరులున్నా వాటి వైపు అధికారులు దృష్టి సారించి గిరిజనులను ప్రోత్సహిస్తే ఆర్థికాభివృద్ధి సాధించడానికి వీలుంటుంది.

గతంలో శిక్షణ ఉపాధి

గతంలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో పని చేసిన పిఒలు గుమ్మలక్ష్మీపురంలో బనియన్ ఫ్యాక్టరీ, పి.లేవిడిలో పట్టు పరిశ్రమ, డుమ్మంగిలో చేపల ఉత్పత్తి కేంద్రం, ఎస్‌కె పాడు నర్సరీలో మొక్కలకు అంట్లు కట్టడం తదితర వాటిలో గిరిజనులకు శిక్షణతో పాటు ఉపాధి కల్పించేవారు. ప్రభుత్వానికి ఆదాయం, మరోవైపు గిరిజనులకు ఉపాధితో ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ఆ తర్వాత కాలంలో వచ్చిన ఐటిడిఎ అధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంతో మరుగున పడిపోయాయి. పిఒగా పనిచేసిన సువర్ణ పండాదాస్ నిరుద్యోగ మహిళలను ప్రోత్సహించేందుకు ఫ్యాషన్ టెక్నాలజీలో కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పించారు. అయితే శిక్షణానంతరం స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బెంగళూరు, చెన్నై వంటి దూరప్రాంతాలకు పంపించడంతో ఆసక్తి చూపలేదు. మరోవైపు జీడి గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఇందుకోసం జెకె పాడు, ఇరిడి, దురుబిల్లిలో ప్రాసెసింగ్ యూనిట్ల కేంద్రాలకు భవనాలు నిర్మించారు. యంత్ర సామగ్రి కూడా కొనుగోలు చేసి సిద్ధం చేశారు. కొంత మంది జీడి రైతులను చెన్నై పంపించి ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించారు. అంతా బాగానే ఉన్నా చివరి నిమిషంలో ఆయన బదిలీపై వెళ్లడంతో ఆ తర్వాత వచ్చిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూలనపడ్డాయి.

అభివృద్ధి కి నోచుకోని దుమ్మంగి చేపల కేంద్రం

జె కె పాడు లో జీడి ప్రాసెసింగ్ యూనిట్ కేంద్రం

వేల ఎకరాల్లో చింత, జీడి సాగు

మన్యం జిల్లాలోని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35 వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు పది వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తుంది. నూటికి నూరు శాతం మంది రైతులు జీడి పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మరోవైపు ఐటిడిఎ పరిధిలో 40 వేల ఎకరాల్లో చింత చెట్లు ఉన్నాయి. ప్రతి ఏటా 10 వేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోంది. వీటితో పాటు కొండ చీపురులు, కొండ తామర దిగుబడి ఉంటుంది.

ముందుకు రాని ప్రభుత్వ సంస్థలు...

ప్రతి ఏటా ఏజెన్సీలో జీడి పంట వ్యాపారం కోట్లాది రూపాయలు జరుగుతున్నా ఐటిడిఎ, జిసిసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. దీంతో దళారుల బెడద ఎక్కువ కావడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోంది. చింతపండుతో పాటు జీడి పంట కూడా పదేళ్ల కిందట అధికారులు కొనుగోలు చేసేవారు. సంస్థకు కష్టాలు వచ్చాయని కొనుగోలు నిలిపివేశారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జీడి, చింతపండు, కొండ చీపుర్లు ప్రాసెసింగ్ చేసేందుకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. గత కొన్నేళ్ల నుంచి ఏజెన్సీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా నేటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గిరిజనులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

చేపల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

డుమ్మంగిలో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టాలి. చేప పిల్లల ఉత్పత్తి ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సొసైటీలు ఏర్పాటు చేసి చేప పిల్లల అమ్మకాలు చేపడితే ప్రభుత్వానికి లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది.

పాలక క్రాంతికుమార్,
సర్పంచి, డుమ్మంగి .

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి...

గిరిజనులు పండించే జీడి, చింతపండును ఐటిడిఎ, జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు గ్రామాల్లోకి నేరుగా వచ్చి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి.

పి. తిరుపతిరావు
ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి

మత్స్యకారుడి మృతి విచారకరం

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం
ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డలో చేపలవేటకు వెళ్లి మృతి చెందిన జన్ని బాలరాజు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, గత ఐదేళ్ల వైసిపి పాలనలో మత్స్యకారుల సంక్షేమం గాలికి వదిలేశారని, ఇప్పుడు మత్స్యకారుల సంక్షేమం గురించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ వైసిపి నాయకులను ప్రశ్నించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దగెడ్డ జలాశయంలో బాలరాజు ప్రమాదవశాత్తు పడి గల్లంతై మృతిచెందడం దురదృష్టకరమన్నారు. వారి కుటుబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని వారు స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఎంపిపి పి.ప్రమీల అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో మత్స్యకారుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ఏం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందో, ఏం అభివృద్ధి కార్యక్రమాలు చేసిందో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి కనీసం చేప పిల్లలను కూడా జలాశయాల్లో విడిచిపెట్టలేదని వారు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, అదే రీతిలో సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తున్నామని అన్నారు. గడిచిన ఐదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను వైసిపి ప్రభుత్వం మోసగించి వారి సంక్షేమాన్ని పూర్తిస్థాయిలో విస్మరించిందన్నారు. గతంలో పెద్దగెడ్డ జలాశయంలో ప్రమాదవశాత్తుపడి గల్లంతై మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలను ఏ విధంగా ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

విలేకరుల సమావేశంలో ఎఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, త్రీ మెన్ కమిటీ చైర్మన్ మాదిరెడ్డి మజ్జారావు, కేసలి గ్రామ టిడిపి అధ్యక్షులు ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను తొలగిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కొమరాడ

రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో రోడ్డు ఆక్రమణను తొలగిస్తామని ఆర్‌అండ్‌బి ఇఇ బి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈనెల 29లో 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ వార్తకు ఆయన స్పందిస్తూ ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొమరాడ మండలానికి సంబంధించి చిలకపాలెం- రామభద్రపురం- రాయగడ రహదారి ఆక్రమణ గురించి కొమరాడ తహశీల్దార్‌కు ఎఫ్ఎంబి వివరాలను లిఖితపూర్వకంగా కోరామన్నారు. ఆ వివరాలు రాగానే మార్కింగ్ చేసి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణను తొలగిస్తామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు కరువు

- వేలాది రూపాయల ఫీజులు దోపిడీ
- అయినా మౌలిక సదుపాయలు లేకపాయే
- అడ్మిషన్‌లకు ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులపై నిఘా
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి- సంతకవిటి

విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు శాపంగా మారాయి. మండలంలోని 7 ప్రైవేట్ విద్యాసంస్థలలో 1428 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బాగా పెరిగింది. డబ్బులిచ్చి చదివినా కనీస మౌలిక సదుపాయాలు కరువైయ్యాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఉన్న వైజ్ స్కూల్, శ్రీ సంతోషి హై స్కూల్‌లలో విద్యార్థుల నుండి వేలాది రూపాయల పీజులు వసూళ్లు చేస్తున్నా కనీసం మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. అనర్హత కలిగిన ఉపాధ్యాయులతో పాఠశాలలు కొనసాగిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. శిథిలావస్థకు చేరుకున్న రేకులు షెడ్లు లలో, ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. బాల, బాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మరుగుదొడ్లు విద్యార్థినిలకు మాత్రమే వినియోగిస్తున్నా చాలడం లేదు.

ఆరుబయటే బహిర్భూమి

ఇక బాలురు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మరుగుదొడ్లు లేక చిన్నారులు బహిర్భూమికి, కాళ్ల కృత్యాలు తీర్చుకోవడానికి పిల్ల కాలువలు వైపు బారులు తీస్తున్నారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులు విష సర్పాలు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సంతకవిటి నుండి పొందూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యార్థులు మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం పాఠశాల యాజమాన్యం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుంది. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో మరి.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల అండ దండలు ఉండడంతో మండల విద్యాశాఖ అధికారులు కనీసం తనిఖీలు కూడా చెయ్యడం లేదు. వైజ్ స్కూల్ విద్యార్థులకు చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ అన్ని లోపలే జరిగిపోతాయి. ఇక్కడ కూడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు నానా అవస్థలుపడుతున్నారు. ఇంగ్లీష్ మీడియం పేరుతో పేద విద్యార్థుల నుండి అధిక పీజులు వసూళ్లు చేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు కంటే.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఈ సంవత్సరం అడ్మిషన్లు జరిగాయి. ప్రైవేట్ పాఠశాలలో సమస్యలు తిష్ట వేసినా మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోయినా.. జిల్లా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

బస్సుల పేరిట మరింత దోపిడీ

మూత్ర విసర్జన కోసం ఆరుబయటకు వెళ్లిన విద్యార్థులు

ఈ పాఠశాలల విద్యార్థుల నుండి బస్సులు పేరుతో మరింత దోపిడీ చేస్తున్నారు. స్కూల్ బస్సుకు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. జిల్లాలోని చివరి మండలమైన సంతకవిటి ప్రైవేట్ పాఠశాలలో ఇంత దారుణం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

నూతన విద్యా విధానం అమలు కావడంతో మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేక మూసివేశారు. మరో 26 పాఠశాలలకు ఏకోపాధ్యాయులు ఉన్నారు. మండవకురిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంఖ్య భారీగా తగ్గిపోవటానికి స్థానిక రాజకీయ నాయకుల అండదండలే కారణమని చెబుతున్నారు. వీటి సమీపంలో ఈ ప్రైవేట్ స్కూల్ ఉండడంతో ప్రైవేట్ స్కూల్‌కి పేద విద్యార్థులు బారులు తీరుతున్నారు. దీంతో సర్కార్ బడిలో విద్యార్థులు ఖాళీ అయ్యారు. ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ పిల్లల వద్ద అధిక ఫీజులు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని విద్యావ్యాపారం విచ్చలవిడిగా జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం నిద్ర మత్తులోనే ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

చిదిమి జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులు

స్పీడ్ బ్రేకర్లు కరువు
మొద్దు నిద్రలో ఆర్ అండ్ బి అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి, రేగులపాడు, బొడ్లపాడు, పాపంపేట, చిటపూడి వలస, కడకల్ల, తదితర గ్రామాల జంక్షన్ల ప్రధాన మలుపుల వద్ద ఆర్ అండ్ బి శాఖ అధికారుల మొద్దు నిద్ర వల్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోవడంతో బాధిత ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మండలంలోని చిదిమి జంక్షన్ వద్ద గల ప్రధాన మలుపు వద్ద పిచ్చి మొక్కలు నిండికొనడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల జరుగుతున్నాయి. కనీసం ఆర్ అండ్ బి అధికారులు స్పీడ్ బ్రేకర్లు కాదు కదా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేందుకు పిచ్చి మొక్కలను కూడా తొలగించకపోవడం దారుణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ప్రధాన మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైస్‌మిల్ సమీపాన కాలువల కబ్జాతో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

కాలువలు కబ్జా

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం నుంచి చలివేంద్రి వెళ్లే మార్గమధ్యలో అయ్యప్ప మోడరన్ రైస్ మిల్ సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు కబ్జాకు గురవ్వడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో నిరంతరం రోడ్డుపైనే నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులకు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నీరు నిల్వ ఉండడం వల్ల రహదారిపై పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడడంతో తరచుగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాదారులపై తగు చర్యలు తీసుకొని రహదారిపై వర్షం నీరు నిల్వ లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లారీలను ఢీకొని క్లీనర్ మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

రామవరం ఎన్‌హెచ్ 26 బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీలను మరొక లారీ శనివారం అర్థరాత్రి ఢీకొనడంతో క్లీనర్ కోన వెంకటరమణ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. గంట్యాడ పోలీసుల వివరాల ప్రకారం.. రామవరం జంక్షన్ దాటిన తర్వాత జిబి కాంక్రీట్ వర్క్స్ దగ్గరలో ఆగి ఉన్న రెండు లారీలను వెనుక నుడి వస్తున్న లారీ టైర్ పేలిపోవడంతో బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదానికి కారణమైన లారీ క్యాబిన్‌లో ఉన్న క్లీనర్ కోన వెంకటరమణ క్యాబిన్‌లో చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునిది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలమని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలం కోరుకొండ, అలమండ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైందని రైల్వే ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. సుమారు 5.5 అడుగుల పొడవు, చామన చాయ రంగులో ఉండి, నలుపురంగుపై చిన్న చిన్న తెలుపు రంగుల పువ్వులు గల ఫుల్‌హ్యాండ్ షార్ట్, నీలంరంగు షార్ట్ ధరించాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ వ్యక్తి సమాచారం ఎవరికైనా తెలిస్తే 9490617089, 6301365605 నెంబర్లను సంప్రదించాలని కోరారు.